# ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ

- నేడు ఓట్ల లెక్కింపు
- పోలింగ్ సరళితో మెజార్టీపై కూడికలు, తీసివేతలు



ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు (ఫైల్)

న్యాల్‌కల్, డిసెంబర్ 2 : అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఆదివారం ఫలితాలను ప్రకటిస్తుండటంతో మండలంలో ఏ పార్టీకి మెజార్టీ వస్తుందో అంటూ వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు కూడికలు.. తీసివేతలు వేస్తూ అభ్యర్థుల గెలుపును అంచనా వేసుకుంటున్నారు. మండలంలోని 37 గ్రామాల్లో 47,449 మంది ఓటర్లకు 37,503 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 79శాతం పోలింగ్ నమోదు కావడంతో పార్టీల నా యకులు, కార్యకర్తలు గ్రామాల వారీగా నమోదైన పోలింగ్ లిస్టులు తీసుకుని ఏ పార్టీకి ఎంత మెజార్టి వస్తుందని లెక్కలు వేస్తూ బిజీగా ఉన్నారు. 2018లో జరిగిన ఎన్నికల్లో 81శాతం పోలింగ్ నమోదు కాగా, ఈసారి 79శాతం పోలింగ్ నమోదైంది. గత ఎన్నికలకు పోల్చి చూస్తే మండలంలో 2శాతం పోలింగ్ తగ్గింది. దీంతో మండలంలోని గ్రామాల్లో ఎక్కడ చూసిన ప్రతి ఒక్కరూ ఏ అభ్యర్థి గెలుస్తారో.. ఎవరు ఓడిపోతారో అంటూ ఆసక్తికర చర్చలు నడుస్తున్నాయి. కొందరూ నాయకులైతే తమ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో గ్రామాల్లో పోలైన ఓటింగ్ శాతాన్ని అంచనా వేస్తున్నారు. మరో వైపు ఎన్నికల ఫలితాలు వెల్లడి కాకముందే అభ్యర్థుల గెలుపుపై గ్రామాల్లో ఉద్యోగులు నుంచి నాయకులు, వ్యాపారులు, యువకులు సైతం అభ్యర్థుల గెలుపోటములపై జోరుగా బెట్టింగ్ కడుతున్నారు. కొన్ని గంటలే మిగిలి ఉండటంతో ఈవీఎంలో పార్టీల అభ్యర్థుల భవిత ఎలా ఉంటుందో అని నాయకులు, కార్యకర్తలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## నిజాయితీని చాటుకున్న కండక్టర్

నారాయణఖేడ్, డిసెంబర్ 2: ప్రయాణికురాలు పోగొట్టుకున్న ల్యాప్‌ట్యాప్‌ను బస్సు కండక్టర్ చొరవతో తిరిగి ప్రయాణికురాలికి అందజేశారు. నారాయణఖేడ్ ఆర్టీసీ డిపో కండక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణఖేడ్ నుంచి జహీరాబాద్ వెళ్తున్న ఓ ఉపాధ్యాయురాలు బస్సులో తన ల్యాప్‌ట్యాప్‌ను మరిచిపోయి వెళ్లిపోయింది. అనంతరం సదరు ప్రయాణికురాలు తన ల్యాప్‌ట్యాప్‌ను బస్సులోనే మరిచిపోయినట్లు గమనించిన కండక్టర్ జనాబాయి ల్యాప్‌ట్యాప్‌ను డిపో సెక్యూరిటీ హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ, కార్యాలయ సూపరింటెండెంట్ చందుపట్ల సమక్షంలో ప్రయాణికురాలికి అందజేశారు. నిజాయతీని చాటుకున్న కండక్టర్ జనాబాయిని ఆర్ఎం ప్రభులత, డిప్యూటీ ఆర్ఎస్ దైవాధీనం, డిపో మేనేజర్ అభినందించారు.



ల్యాప్‌ట్యాప్‌ను ప్రయాణికురాలికి అందజేస్తున్న కండక్టర్

## ప్రపంచ శాంతి కోసం ప్రార్థనలు చేయాలి

### ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్, డిసెంబర్ 2 : ప్రపంచం శాంతిగా ఉండేందుకు ప్రత్యేక ప్రార్థనలు చేయాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు కోరారు. శనివారం జహీరాబాద్ పట్టణం నుంచి ఉమ్రా యాత్రకు వెళ్తున్న వారిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జహీరాబాద్‌కు చెందిన జలీల్, ముస్తఫా ఉమ్రా యాత్రకు పోవడం సంతోషంగా ఉందన్నారు. ఉమ్రాలో ప్రత్యేక దర్శనం చేసుకోని అల్లా దయతో ప్రపంచం శాంతియుతంగా ఉండాలని కోరాలన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మంకల్ సుభాశ్, బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు రాములునేత, మోతీ రాం, యూనూస్, జంహగీర్, అబ్దుల్లా, అలీ, అక్రమ్ ఉన్నారు.



జహీరాబాద్ పట్టణంలో ఉమ్రాయాత్రకు వెళ్తున్న వారిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

## ముగిసిన అఖండ హరినామ సప్తాహం

న్యాల్‌కల్, డిసెంబర్ 2 : మండలంలోని రేజింతల్ సిద్ధి వినాయక ఆలయంలో నిర్వహించిన అఖండ హరినామ సప్తాహ మహోత్సవాలు ముగిసాయి. అంబదాస్ మహారాజ్, రాజేంద్ర మహారాజ్ వారం రోజులుగా అఖండ హరినామ సప్తహా మహోత్సవాన్ని నిర్వహించారు. ముగింపు సందర్భంగా ఉదయం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి పల్లకీసేవ ఊరేగింపు చేపట్టారు. భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భజన భక్తి మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ

హత్నూర, డిసెంబర్ 2 : మండలంలోని వడ్డెపల్లిలో రవీందర్ గురుస్వామి ఆధ్వర్యంలో 18వ మహాపడిపూజను శనివారం ఘనంగా నిర్వహించారు. గంగాధర్ గురుస్వామి ఆధ్వర్యంలో పూజలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. అయ్యప్పస్వామి నామస్మరణతో భజన సంకీర్తనలు కొనసాగగా భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం అయ్యప్పస్వాములు తీర్థప్రసాదాలు స్వీకరించారు.



వడ్డెపల్లిలో నిర్వహించిన అయ్యప్పస్వామి మహాపడి పూజ

## రానున్నది ప్రజా సంక్షేమ ప్రభుత్వం

నాగల్‌గిద్ద, డిసెంబర్ 2 : రాష్ట్రంలో నేడు వెలువడనున్న ఎన్నికల ఫలితాల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించి సీఎం కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఎంపీపీ మోతిబాయి రాథోడ్ అన్నారు. శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రజ ల సంక్షేమం కోసం కృషి చేస్తున్నదన్నారు. ప్రజలు బీఆర్ఎస్‌కీ స్వచ్ఛందంగా ఓటు వేశారన్నారు. ఎగ్జిట్‌పోల్ సరళి అంతా భూటకమని బీఆర్ఎస్ కార్యకర్తలు ఎవ్వరూ అధైర్యపడొద్దని ఆమె సూచించారు.

## ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన

నారాయణఖేడ్, డిసెంబర్ 2 : నారాయణఖేడ్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులకు శనివారం ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఆయుర్వేద వైద్యులు నారాయణరావు, స్థానిక ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌గౌడ్ పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ నారాయణరావు విద్యార్థులకు యోగాసనాలు, ఆహారపు అలవాట్ల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులకు, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏటీపీ శివశంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




విద్యార్థులతో డాక్టర్ నారాయణరావు

## జీఎంఆర్ విజయం ఖాయం

గుమ్మడిదల, డిసెంబర్ 2 : పటాన్‌చెరు ఎమ్మెల్యే అభ్యర్థి, గూడెం మహిపాల్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో విజయం ఖాయమని బీఆర్ఎస్ అభిమాని రౌతు నరేశ్ అన్నారు. ఆదివారం జరిగే అసెంబ్లీ ఎన్నికల లెక్కింపులో ప్రజాధారణ కలిగిన ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి విజయసుసాధ్యమైందని అన్నారు. ఈ విజయాన్ని పురస్కరించుకొని గుమ్మడిదల మండల కేంద్రం నుంచి కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం వరకు పాదయాత్ర చేయనున్నట్లు ఆయన తెలిపారు. దీనికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలి రానున్నరని తెలిపారు.

## పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

న్యాల్‌కల్, డిసెంబర్ 2: ఇంటి పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యాంగా ఉంటామని మండలంలోని మిర్జాపూర్(బి) ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నృపేన్ చక్రవర్తి అన్నారు. శనివారం మండలంలోని గంగ్వార్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పరిసరాల శుభ్రత, ఆరోగ్య, పోషక విలువలపై గర్బిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఇంటి పరిసరాల్లో పెరుకుపోయిన చెత్తచెదారం, మురుగుకాల్వలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఏవైనా వ్యాధులు సోకితే వెంటనే ప్రజలు ఆరోగ్య కేంద్రాలకు వచ్చి వైద్య పరీక్షలను చేయించుకోవాలన్నారు. చిన్నారులు, బాలింతలు, గర్బిణులు క్రమం తప్పకుండా వైద్య సిబ్బందిని సంప్రదించి పరీక్షలను చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



గంగ్వార్ అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్బిణిలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

## ఎల్లంకి కళాశాలలో విద్యార్థులు రక్తదానం

పటాన్‌చెరు, డిసెంబర్ 2: ఎల్లంకి ఇంజినీరింగ్ కళాశాలలో ఎల్లంకి మాధవరెడ్డి మెమోరియల్ ట్రస్ట్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శనివారం అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడలోని ఎల్లంకి కళాశాలలో విద్యార్థులతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన కళాశాల చైర్మన్ సదాశివరెడ్డి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం అన్ని దానాల్లో గొప్పదన్నారు. ఒక మనిషి ప్రాణాలను కాపాడే అదృష్టం రక్తదానంతో కలుగుతుందన్నారు.

ఎల్లంకి మాధవరెడ్డి స్ఫూర్తితో ఎల్లంకి గ్రూప్స్ అత్యుత్తమమైన విలువలతో విద్యను అందిస్తున్నదన్నారు. ఆయన జ్ఞాపకర్థంగా రక్తదాన శిబిరం నిర్వహించ డం అభినందనీయం అన్నారు. సేవా కార్యక్రమాల్లోనూ ఎల్లంకి కళాశాల విద్యార్థులు ఎప్పుడూ ముందుంటుందన్నారు. రక్తదానం చేస్తున్న సిబ్బంది, విద్యార్థులను ఆయ న అభినందించారు. మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని కళాశాల యాజమాన్యం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.


ఈ శిబిరం లో వంద యూనిట్ల రక్తాన్ని సేకరించారు. రక్తదానం చేసినవారికి సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో సెక్రటరీ దయాకర్‌రెడ్డి, డైరెక్టర్ సాయి శివారెడ్డి, ప్రిన్సిపాల్ జాన్‌పాల్ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఎల్లంకి విద్యార్థులు

## ప్రభుత్వ దవాఖానల్లో అవగాహన సదస్సు

అందోల్, డిసెంబర్ 2 : ప్రపంచ ఎయిడ్స్‌డేను పురస్కరించుకుని శనివారం జోగిపేట ప్రభుత్వ దవాఖానలో సూపరింటెండెంట్ రమేశ్ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సును నిర్వహించినట్లు జోగిపేట జడ్జి ధనలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్ భారిన పడిన వారు సమాజంలో చాలా అవమానాలకు గురవుతున్నారని వారిపై ప్రేమాభావంతో ఉండాలన్నారు. హెచ్ఐవీకి వ్యతిరేకంగా పోరాడాలని, వ్యాధి బారిన పడిన వారికి అండగా ఉండేలా స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం దవాఖానలో ఉన్న పేషెంట్లకు పండ్లు పంపిణీచేసి దవాఖానలో అందుతున్న సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు.



జోగిపేట ప్రభుత్వ దవాఖానలో పండ్లు పంపిణీ చేస్తున్న జడ్జి ధనలక్ష్మి